ఆంధ్రజ్యోతి **
ANDHRAJYOTHY
సూర్యాపేట 3
సోమవారం 13 మే 2024

పార్లమెంట్	నియోజకవర్గాలు	అభ్యర్థులు	ప్రధాన పార్టీలు	స్వతంత్రులు	పోలింగ్ కేంద్రాలు	ఓటర్లు	సెక్టార్ అధికారులు	పీవోలు	ఓటర్ స్లిప్పుల పంపిణీ	స్వాధీనం చేసుకున్న సొమ్ము	సమస్యాత్మక కేంద్రాలు	పోలీస్ సిబ్బంది
భువనగిరి	7	39	20	19	2,141	18,08,585	245	2,264	98.30 శాతం	రూ.14.68 కోట్లు	166	3500
నల్లగొండ	7	22	8	14	2,061	17,25,465	200	2022	100 శాతం	రూ.29.20 కోట్లు	365	3000

దేశ భవిష్యత్‌ను మార్చే సార్వత్రిక ఎన్నిక పోలింగ్ సోమవారం జరగనుంది. ప్రచార హోరు.. ప్రత్యర్థులపై విమర్శనాస్త్రాలు.. వినూత్న ప్రచారాలతో వేడెక్కిన రాజకీయం నేటితో చల్లబడనుంది. వేసవిలోనూ తమ దైన రీతిలో ప్రచారం చేసిన అభ్యర్థుల బూత్ పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలైన భువనగిరి, నల్లగొండ జిల్లాల్లో అధికారులు పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల సామగ్రిని సకాలంలో అందించడంతోపాటు, సిబ్బందిని నియమించారు. నేడు జరిగే సార్వత్రిక సమరానికి ఇటు ఓటర్లు.. అటు అభ్యర్థులు అంతా సిద్ధమయ్యారు.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి-నల్లగొండ)



ఓటుకు వేళాయె

- బందోబస్తు ఏర్పాట్లు చేసిన పోలీసులు
- పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఈవీఎంలు
- నల్లగొండ పార్లమెంట్‌లో 17,25,465 మంది ఓటర్లు
- ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు వరకు పోలింగ్

18వ లోక్‌సభ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, భువనగిరి లోక్‌సభ స్థానాలకు సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. నల్లగొండ పార్లమెంట్‌కు 22 మంది అభ్యర్థులు, భువనగిరి లోక్‌సభకు 39 అభ్యర్థి బరిలో ఉన్నారు. నల్లగొండ లోక్‌సభ స్థానంలో 17,25,465 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం 2,061 పోలింగ్ కేంద్రాలు ఇందుకోసం ఏర్పాటయ్యాయి. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గకేంద్రం నుంచి ఆదివారమే పోలింగ్ సిబ్బంది, పోలీస్ బలగాలు ఎన్నికల సామగ్రితో తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్లకు ప్రత్యేక బస్సుల్లో తరలివెళ్లారు. రాత్రికి అక్కడే ఉండే సిబ్బంది ఉదయం 5.30 నుంచి మాక్ పోలింగ్ నిర్వహించి సరిగ్గా ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభించనున్నారు. ఈ మేరకు నల్లగొండ లోక్‌సభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన అన్ని ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించడంతోపాటు, నల్లగొండ, దేవరకొండలో పంపిణీ కేంద్రాలను సందర్శించి ఉద్యోగులకు సూచనలిచ్చారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు జిల్లా పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్లకు సిబ్బంది, సామగ్రి చేరేలా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నల్లగొండ లోక్‌సభలో 2061 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు

నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,061పోలింగ్ స్టేషన్లను ఏర్పాటుచేశారు. మొత్తం 1,435 లొకేషన్లలో ఈ కేంద్రాలు ఏర్పాటుచేశారు. వీటిల్లో మహిళలకోసం ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో అయిదు చొప్పున 35 పోలింగ్ కేంద్రాలు, ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గాల్లో అయిదు చొప్పున మరో 35 మోడల్ పోలింగ్ స్టేషన్లు, ప్రత్యేకావసరాలకుగల వారికోసం ఒక్కో పోలింగ్ స్టేషన్ చొప్పున ఏడు, యువతకోసం ప్రత్యేకంగా మరో ఏడు పోలింగ్ స్టేషన్లను ఈసారి ఏర్పాటు చేశారు. మొత్తం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 365 సమస్యాత్మక పోలింగ్‌స్టేషన్లు గుర్తించి అక్కడ ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గంలో 63, సూర్యాపేట నియోజకవర్గంలో 60సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. 365 సమస్యాత్మక కేంద్రాల వద్ద పోలింగ్ ప్రారంభం నుంచి ముగిసే వరకూ వెబ్‌కాస్టింగ్‌తోపాటు, కేంద్రాల బయట సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఆయా కేంద్రాల వద్ద, ఆ ప్రాంతాల్లో ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోలింగ్‌కేంద్రాల వద్ద సకల సదుపాయాలు

వేసవి కాలం కావడం, ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు, సిబ్బందికి ఇబ్బంది లేకుండా అన్ని రకాల సదుపాయాలు కల్పించారు. పోలింగ్ కేంద్రాల్లో ఫర్నిచర్, హెల్ప్ డెస్క్, విద్యుత్ లైట్లు, వృద్ధులు, మహిళలు, దివ్యాంగుల నిమిత్తం ర్యాంపులు, టాయిలెట్లు, తాగునీటి వసతి, టెంట్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా ప్రాథమిక చికిత్స కిట్లు, సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులకు సహాయపడే పోలింగ్ వలంటీర్లను కూడా అందుబాటులో ఉంచారు.

వందశాతం ఓటర్ స్లిప్పుల పంపిణీ

లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఓటింగ్‌శాతం పెంచేందుకు, ఓటర్లు కేంద్రాల వద్ద ఎలాంటి అసౌకర్యానికి లోనవకుండా ఉండే నిమిత్తం ఎన్నికల సంఘం పూర్తి ఏర్పాట్లు చేసింది. బీఎల్‌వోల ద్వారా ఇంటింటికీ వెళ్లి ఓటర్ స్లిప్పులను ఇప్పటికే అందజేశారు. ఇప్పటికే లోక్‌సభ స్థానం పరిధిలోని 17,25,465 మంది ఓటర్లకు ఇప్పటికే స్లిప్పులను ముద్రించి అందజేశారు. ప్రతీ ఓటరుకు ఓటు వేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని గుర్తించాలనే సందేశాన్ని ఫోన్లలో చేరవేశారు.

ఎన్నికలకు భారీ బందోబస్తు

నల్లగొండ లోక్‌సభస్థానం పరిధిలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు పోలీస్ శాఖ ఏర్పాట్లు పూర్తిచేసింది. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద ఇద్దరు, అంతకు మించి పోలీసులను నియమించారు. నల్లగొండ జిల్లాలో ఎస్పీ చందనదీప్తి పర్యవేక్షణలో ఇద్దరు ఏఎస్పీలు, తొమ్మిది మంది డీఎస్పీలు, 37 మంది సీఐలు, 84 మంది ఎస్ఐలతోపాటు 3వేల మంది కానిస్టేబుళ్లు ఎన్నికల విధుల్లో ఉండనున్నారు. వీరితోపాటు మరో ఏడు కంపెనీల కేంద్ర బలగాలు అయిదు ప్లాటూన్ల టీఎస్ఎస్‌పీ సిబ్బంది, పెట్రోలింగ్ పార్టీలు, క్విక్ రియాక్షన్‌టీములు, స్ట్రయికింగ్, స్పెషల్ స్ట్రయికింగ్ ఫోర్సులు ఎన్నికల విధుల్లో ఉన్నాయి. ఎన్నికల సందర్భంగా ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరువరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్పీ వెల్లడించారు.

12 గుర్తింపు కార్డుల్లో ఏది ఉన్నా అనుమతి

కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఓటరు గుర్తింపు కార్డు ఉంటే ఓటరు పోలింగ్‌స్టేషన్‌కు వెళ్లి ఓటు వేయవచ్చు.



- ఆధార్ కార్డు
- ఉపాధిహామీ పథకం జాబ్‌కార్డు
- డ్రైవింగ్ లైసెన్స్
- పాన్‌కార్డు
- పాస్‌పోర్టు
- పెన్షన్ డాక్యుమెంట్
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు కార్డులు,
- బ్యాంకు, పోస్టాఫీస్ పాస్ పుస్తకాలు
- జనాభా రిజిస్ట్రార్ జారీచేసిన స్మార్ట్‌కార్డు
- హెల్త్‌ఇన్సూరెన్స్ స్మార్ట్‌కార్డు
- ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల అధికారిక గుర్తింపుకార్డులు
- భారత ప్రభుత్వ శాఖ జారీ చేసిన దివ్యాంగుల గుర్తింపు కార్డులు

ఓటింగ్‌శాతంపైనే అభ్యర్థుల ఆందోళన

ఎండలు మండిపోతుండడంతో లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్‌శాతం ఏ మేరకు నమోదవుతుందోననే ఆందోళన అభ్యర్థుల్లో, రాజకీయ పార్టీల్లో నెలకొంది. ఓటింగ్ శాతం పెంచేందుకు అధికారయంత్రాంగం, ఆయా పార్టీల ప్రతినిధులు ప్రయత్నాలు చేసినప్పటికీ ఓటర్లు ఏమేరకు ఓటింగ్‌కు వస్తారనే సందేహం వెంటాడుతోంది. ఎండలను దృష్టిలో ఉంచుకొనే పోలింగ్ సమయాన్ని సాయంత్రం గంట పెంచి ఆరుగంటల వరకు అనుమతించారు. అదేవిధంగా ఆరు గంటల తర్వాత కూడా లొకేషన్‌లో ఉన్న, పోలింగ్ స్టేషన్ వద్దకు వచ్చి లైన్లో ఉంటే ఆ ఓటర్లకు ఓటేసేందుకు అనుమతిస్తారు.

జిల్లాలో ఏర్పాట్లు పూర్తి

సూర్యాపేట(కలెక్టరేట్): జిల్లాలో నేడు జరిగే పార్లమెంట్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోని సూర్యాపేట, కోదాడ, తుంగతుర్తి, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో జిల్లావ్యాప్తంగా 9,99,033 మంది ఓటర్లు ఓటు నమోదు చేసుకున్నారు. ఎన్నికలకు సంబంధించి జిల్లాలో 1,201 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ యంత్రాలను ఇప్పటికే సిద్ధంచేసి ఆయా నియోజకవర్గాల్లోని స్ట్రాంగ్‌రూంలో భద్రపర్చారు. అక్కడినుంచి సంబంధిత పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రితో పాటు సిబ్బంది చేరుకున్నారు. ఈ ఎన్నికల్లో 1,680 వీవీ ప్యాట్లు, 1500 కంట్రోల్ యూనిట్లు, 3,407 బ్యాలెట్ యూనిట్లను వినియోగిస్తున్నారు. వీటితోపాటు అదనంగా మరో 10శాతం పోలింగ్ యంత్రాలను రిజర్వ్‌లో ఉంచారు. ఎన్నికల నిర్వహణ విధుల్లో 5,600మంది ఉద్యోగులు పాల్గొనున్నారు. వీరితో పాటు 3 వేలకుపైగా పోలీస్ సిబ్బంది విధులు నిర్వహించనున్నారు.

జిల్లావ్యాప్తంగా 1,201 పోలింగ్ కేంద్రాలు

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 1,201 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతీ 1200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం, పట్టణ ప్రాంతాలలో 1,400 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం చొప్పున ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికలకు సంబంధించి అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. జిల్లాలో నాలుగు నియోజకవర్గాల పరిధిలో 9.99లక్షల ఓటర్లు ఉన్నారు.

పోలింగ్ సామగ్రి సిద్ధం

పోలింగ్‌కు సంబంధించి సామగ్రిని సిద్ధం చేశారు. 1,680 వీవీ ప్యాట్లు, 1,500 కంట్రోల్ యూనిట్లు, 3,407బ్యాలెట్ యూనిట్లను వినియోగిస్తున్నారు. వీటితో అదనంగా మరికొన్ని పోలింగ్ యంత్రాలను ఉంచారు.

జిల్లావ్యాప్తంగా రూ.29.20కోట్లు నగదు సీజ్

జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు, ఆకస్మిక తనిఖీల్లో ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా రూ.29.20కోట్లు అధికారులు సీజ్‌చేశారు. వాటితోపాటు రూ.12.14కోట్లకు పైగా విలువైన వెండి, బంగారు ఆభరణాలు, కోటి రూపాయలకుపైగా విలువ చేసే వివిధ రకాల వస్తువులను అధికారులు సీజ్ చేశారు. అయితే సీజ్ చేసిన నగదుకు సంబంధించి సరైన ఆధారాలు చూపడంతో రూ.2.91 కోట్లు సంబంధిత వ్యక్తులకు గ్రీవెన్స్ కమిటీ ద్వారా అందజేశారు. ఇవే కాకుండా రూ.2.28 కోట్ల పైచిలుకు విలువచేసే వస్తువులను కూడా విడుదల చేశారు.

ఎన్నికల విధుల్లో 5,600 మంది ఉద్యోగులు

జిల్లావ్యాప్తంగా 5,600 మంది ఉద్యోగులు విధులు నిర్వహించనున్నారు. వీరితోపాటు 3వేల మంది పోలీస్ సిబ్బంది ఉన్నారు. ఎన్నికల విధుల కోసం 123 సెక్టోరల్ అధికారులను నియమించి, రూట్లు కేటాయించారు. జిల్లా వ్యాప్తంగా 229 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. అందుకోసం ఆ పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ నిర్వహిస్తున్నారు. వీటితోపాటు మరో 173 పోలింగ్ కేంద్రాల్లో వీడియోగ్రాఫర్లతో రికార్డు చేయనున్నారు.

ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగాలి



ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్నకలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ

సూర్యాపేట(కలెక్టరేట్), మే 12: ఎన్నికల నిర్వహణ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సూర్యాపేట అసెంబ్లీ సెగ్మెంట్ పంపిణీ కేంద్రాన్ని సాధారణ పరిశీలకులు మనోజ్‌కుమార్ మాణిక్యరావు సూర్యవంశీ, ఎస్పీ రాహుల్‌హెగ్డేతో కలిసి పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఆయా పరిధిలో గల పోలింగ్ కేంద్రాలకు రూట్ల వారీగా పోలింగ్ సిబ్బంది, ఈవీఎంలు, సెక్టార్ అధికారి పర్యవేక్షణలో పోలీస్ బందోబస్తుతో వాహనాలను తరలించామని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో ఏర్పాటు చేసిన 112రూట్లలో 1,201 పోలింగ్ కేంద్రాలకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 10,00,012 మంది ఓటర్లున్నారని, 123 సెక్టార్ అధికారులు, 5,600 మంది పోలింగ్ అధికారులు, 173 మంది మైక్రో అబ్జర్వర్లు, 729 మంది వలంటీర్లు ఉన్నారని తెలిపారు. అంగవైకల్యం ఉన్న వారికి 729 ఆటోలు ఏర్పాటు చేశామన్నారు. 229 సమస్యాత్మకకేంద్రాల్లో లోపల, బయట 458 కెమెరాల ద్వారా పోలింగ్ పరిశీలిస్తామన్నారు. ఈ నెల 13న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీచేసి న 12రకాల గుర్తింపు కార్డులు చూపి ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాధవ్, డీఎస్పీ రవి, తహసీల్దార్లు శ్యాంసుందర్‌రెడ్డి, కృష్ణయ్య, మహేందర్‌రెడ్డి,వినోద్‌కుమార్, ఏకాంబరం సిబ్బంది పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలి : ఎస్పీ

సూర్యాపేటక్రైం: కంట్రోల్ సెంటర్ నుంచి సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని ఎస్పీ రాహుల్‌హెగ్డే అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన ఎలక్షన్‌సెల్, సోషల్ మీడియా మానిటరింగ్ యూనిట్, పోలీస్ కంట్రోల్ రూం, సీసీటీవీ కమాండ్ అండ్ కంట్రోల్ రూంలను పరిశీలించి మాట్లాడారు. ఆన్‌లైన్ మానిటరింగ్ చేసే సిబ్బంది పకడ్బందీగా పనిచేయాలన్నారు. అన్ని స్థితిగతులను నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు వీరరాఘవులు, ఎలక్షన్ సెల్ ఎస్ఐ విష్ణుమూర్తి, కమ్యూనికేషన్ ఎస్ఐ రాంబాబు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

కోదాడటౌన్: నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎస్. వెంకట్రావు అన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీని ఎస్పీ రాహుల్‌హెగ్డే, కలెక్టర్ ఎస్.వెంకట్రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలింగ్ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. పట్టణంలోని బాలాజీనగర్‌లో గల ప్రభుత్వ గోదాం వద్ద పోలింగ్ సిబ్బందికి ఈవీఎంలను, ఎన్నికల సామాగ్రిని ఆర్డీవో సూర్యనారాయణ పర్యవేక్షణలో పంపిణీ చేశారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- అదనపు ఎస్పీ మేకా నాగేశ్వరరావు



పోలీసులకు సూచనలు చేస్తున్న అదనపు ఎస్పీ నాగేశ్వరరావు

హుజూర్‌నగర్, మే 12: ఎన్నికల విధుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అదనపు ఎస్పీ మేకా నాగేశ్వరరావు కోరారు. ఆదివారం హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లోగల ఎంపీ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో విధుల్లో పాల్గొన్న పోలీసులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గంలో ఏడు మండలాల్లో 29 రూట్లలో మొత్తం 309 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 678 మంది పోలీసులతో బందోబస్త్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా 39 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో సీఐలు చరమందరాజు, లక్ష్మీనారాయణ, ఆరుగురు అదనపు ఎస్ఐలు, ట్రైనీ పోలీసులు, తమిళనాడు, అరుణాచల్‌ప్రదేశ్ పోలీసులు, తెలంగాణ స్పెషల్ పోలీసులు ఎన్నికల్లో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ చరమందరాజు, లక్ష్మీనారాయణ, ముత్తయ్య, పరమేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు

కేంద్ర ఎన్నికల పరిశీలకులు ఎంఎం సూర్యవంశీ

హుజూర్‌నగర్, మే 12: ఎన్నికల విధుల్లో అధికారులు నిర్లక్ష్యం చేయవద్దని కేంద్ర ఎన్నికల పరిశీలకుడు, ఐఏఎస్ అధికారి మనోజ్‌కుమార్ మాణిక్యరావు సూర్యవంశీ కోరారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం అధికారులతో మాట్లాడారు. అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. విధులు నిర్వహించే వారందరు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. ప్రిసైడింగ్ అధికారులు పోలింగ్ కేంద్రాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వెబ్‌కాస్టింగ్ పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, నాగార్జునరెడ్డి,కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో కేంద్రాన్ని పరిశీలిస్తున్న సూర్యవంశీ

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

భువనగిరి రూరల్, మే 12: యాదాద్రిభువనగిరి జిల్లా భువననగిరి మండలం ఎర్రంబెల్లి గ్రామ శివారు నారగుట్టపై ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నారగుట్టపై మృతదేహం దుర్వాసన రావడంతో విషయం తెలుసుకున్న గ్రామపంచాయతీ కారోబార్ సత్తయ్య పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లగా సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు వ్యక్తి మృతదేహాన్ని కనుగొన్నారు. మృతదేహంపై బనియాన్, గోధుమ కలర్ పాయింట్ ఉన్నాయి. మూడు రోజుల క్రితం గుట్టపైకి ఎక్కి అక్కడే మృతిచెంది ఉన్నాడని తెలిపారు. మతిస్థిమితం లేక అక్కడే చనిపోయి ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

23 లీటర్ల సారా స్వాధీనం

మిర్యాలగూడ అర్బన్, మే 12: నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం కల్లేపల్లి బంగారుమైసమ్మ గుడి వద్ద విక్రయిస్తున్న 23 లీటర్ల సారాను మిర్యాలగూడ ఎక్సైజ్ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. త్రిపురారం మండలం లోక్యాతండాకు చెందిన ధనావత్ నాగ, ధనావత్ జాపర్ ద్విచక్రవాహాలపై సారాను కల్లేపల్లి గ్రామానికి తరలించి గుడివద్ద విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందినట్లు ఎక్సైజ్ సీఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. తమ సిబ్బందితో దాడి చేసి సారా విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు, రెండు ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

యాదగిరికొండపై భక్తుల రద్దీ


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


ఆలయ ఆవరణలో సేద తీరుతున్న భక్తులు


ప్రసాదాల విక్రయశాల వద్ద భక్తులు

నిత్య ఆదాయం రూ. 57.76లక్షలు

భువనగిరి అర్బన్, మే 12: యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణ పరిధిలోని పవిత్ర పుణ్యక్షేత్రం యాదగిరికొండపై ఆదివారం భక్తులరద్దీ నెలకొంది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కాగా, సుమారు 40వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తజనుల రద్దీ కొనసాగింది. ప్రత్యేక దర్శనాలకు ఒక రెండు గంట ధర్మదర్శనాలకు మూడు గంటల సమయం పట్టింది. ప్రధానాలయం, ప్రసాద విక్రయశాలల వద్ద కూడా రద్దీ నెలకొంది. ఆలయ ఉత్తర దిశలో ఏర్పాటు చేసిన షెడ్డు కింద భక్తులు అధిక సంఖ్యలో సేద తీరడమే కాక ఫొటోలకు పోటీ పడ్డారు. భక్తులను కొండపైకి తరలించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.57,76,291 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సుప్రభాత సేవతో స్వామిని, అమ్మవారిని మేల్కొపిన అర్చకస్వాములు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. అనుబంధంగా కొనసాగుతున్న పాతగుట్ట స్వామి అమ్మవారలకు నిత్య పూజలు ఘనంగా చేపట్టారు. శివాలయం లో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామికి నిత్య పూజలు, రుద్రహవన పూ జలు, శైవాగమరీతిలో నిర్వహించారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆల య ద్వారబంధనం చేశారు. కాగా, ప్రధానాలయంలో శ్రీరామానుజచార్యుల పురప్పాట్ సేవ వేద మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ నిర్వహించారు. శివాలయంలో శంకరాచార్య జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఈవో ఏ.భాస్కర్‌రావు, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ప్రధానార్చకుడు లక్ష్మీనరసింహాచార్యులు, పురోహితులు, అర్చకులు పాల్గొన్నారు.

అంగడిపేట ప్రమాదంలో మరొకరు మృతి

పెద్దఅడిశర్లపల్లి, మే 12: నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య రెండుకు చేరింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రకాశం జిల్లా పెద్దరావీడు మండలం ప్రగళ్లపాడుకు చెందిన మంత్ర పెద్దఅంజమ్మ(60) ఆదివారం ఉదయం మృతిచెందింది. దీంతో అంగడిపేట రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య రెండుకు చేరింది. ఆగిఉన్న ఆటోను లారీ వెనుక నుంచి ఢీ కొట్టడంతో ఆటో డ్రైవర్‌తో మాట్లాడుతున్న హెడ్‌కానిస్టేబుల్ మరియదాసు(58) అక్కడికక్కడే మృతిదాడు. ఒకే కుటుంబానికి చెందిన ఎనిమిది మంది ఊరు ఊరు తిరుగుతూ పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. సోమవారం ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ, పార్లమెంటరీ ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి తెలంగాణ రాష్ట్రంలోని చేవెళ్ల నుంచి తన సొంత ఆటోలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బయలుదేరారు. నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు గ్రామ శివారులోని ఓ పెట్రోల్ బంక్‌లో శనివారం అర్ధరాత్రి ఆటోలో డీజిల్ పోసుకుని బంక్ నుంచి బయటకు వెళ్తుండగా అక్కడే విధుల్లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ ఆటోను ఆపడంతో రోడ్డు పక్కకు డ్రైవర్ ఆటోను ఆపారు. దగ్గరకు వచ్చిన హెడ్ కానిస్టేబుల్ ఆటో డ్రైవర్‌తో మాట్లాడుతుండగా కొండమల్లేపల్లి నుంచి అతివేగంగా వస్తున్న లారీ కానిస్టేబుల్‌తో పాటు ఆటోను బలంగా ఢీకొట్టి పారిపోయింది. దీంతో ఆటోలో ఉన్న ఎనిమిది మందిలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా, మిగిలిన వారికి స్వల్ప గాయాలు అయ్యాయి. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తమ సిబ్బందితో 108 వాహనాల్లో క్షతగాత్రులను దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీ వ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ పెద్దఅంజమ్మ ఆదివారం ఉదయం మృతి చెందింది. మిగిలిన ఇద్దరికి ప్రాణహాని లేదని డాక్టర్లు నిర్ధారించారు. హెడ్ కానిస్టేబుల్ కుమారుడు ఉదయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపారు.

రైలునుంచి జారిపడి కార్మికుడు..

మిర్యాలగూడ అర్బన్: రైలు నుంచి జారిపడి ఒడిస్సా రాష్ట్రానికి చెందిన కార్మికుడు మృతిచెందాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. రైల్వే ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెంలోని ఓ రైస్‌మిల్లులో పనిచేస్తున్న కార్మికుడు శంకర్‌జైన్(34) భువనేశ్వర్ నగరానికి వెళ్లేందుకు విశాఖ ఎక్స్‌ప్రెస్‌రైలు ఎక్కుతుండగా పట్టుతప్పి కిందపడిపోగా, అతనిపైనుంచి రైలు వెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించి, మృతుడి కుటుంబసభ్యులకు స మాచారం అందజేసినట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు. భువనేశ్వర్ లోక్‌సభ ఎన్నికల్లో శంకర్‌జైన్ తన ఓటుహక్కు వినియోగించుకునేందుకు వెళ్తున్న క్రమంలో రైలు ప్రమాదానికి గురై మృతిచెందినట్లు తోటి కార్మికులు తెలిపారు.

మానసిక వేదన భరించలేక ఆత్మహత్య


అంత్య క్రియల క్రతువులో పాల్గొన్న కుమార్తె మేఘన

తుర్కపల్లి, మే 12: జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలకేంద్రంలో శనివారం రాత్రి జరిగింది. ఎస్ఐ తక్యుయొద్దీన్, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... మండలకేంద్రానికి చెందిన పిడుగు అశోక్(40) ప్రైవేట్ స్కూల్ బస్సులో డ్రైవర్‌గా పని చేసేవాడు. ప్రస్తుతం ఆ ఉద్యోగం కూడా చేయడం మానేసాడు. పది సంవత్సరాల క్రితం అశోక్ తండ్రి చంద్రయ్య అనారోగ్యంతో, మూడు సంవత్సరాల క్రితం భార్య లావణ్య, రెండు సంవత్సరాల క్రితం తల్లి సుక్కమ్మ అనారోగ్యంతో చనిపోయారు. అప్పటి నుంచి అశోక్ తన ఇద్దరు కుమార్తెలు మేఘన, శ్రీజలను పోషించుకుంటూ ఓ ప్రైవేట్ స్కూల్లో వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ప్రస్తుతం డ్రైవర్ ఉద్యోగం మానేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. కుటుంబ సభ్యుల మృతితో మానసిక వేదనకు గురై మద్యానికి బానిసయ్యాడు. కూతుళ్లు మేఘన, శ్రీజ పాఠశాలలకు సెలవులు రావడంతో అమ్మమ్మ ఇంటికి వెళ్లారు. జీవితంపై విరక్తి చెందిన అశోక్ రాత్రి తన ఇంట్లో చున్నీతో ఫ్యాన్స్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం ఇంటి తలుపు తీయకపోవడంతో పక్కింట్లో ఉన్న బంధువులు తలుపులు తెరిచి చూసే సరికి అశోక్ మృతిచెంది ఉన్నాడు. వెంటనే బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

అశోక్‌కు తలకొరివి పెట్టే కొడుకులు లేకపోవడంతో పెద్ద కూతురు మేఘన తండ్రికి తలకొరివి పెట్టింది. తండ్రి మృతితో ఇద్దరు కూతుళ్లు అనాథలయ్యారు.

నల్లగొండ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మళ్లీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

నల్లగొండ, మే 12: నల్లగొండ జిల్లాలోని 11 ప్రాంతాల్లో 40డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదు కావడంతో అధికారులు ఆదివారం ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. అత్యధికంగా మాడ్గులపల్లిలో 41.7డిగ్రీలు, చింతపల్లి మండలంలో అత్యల్పంగా 37.0డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సూర్యాపేట జిల్లాలో మోతె మండలం మామిళ్లగూడెంలో అత్యధికంగా 41.2 డిగ్రీలు, నాగారంలో మండలంలోని ఫణిగిరి గ్రామంలో అత్యల్పంగా 37.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలంలో అత్యధికంగా 41.2 డిగ్రీలు, అత్యల్పంగా రామన్నపేట మండలంలో 37.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండు రోజులతో పోల్చుకుంటే ఆదివారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో టోల్‌గేట్ల వద్ద వాహనాలు భారీ సంఖ్యలో తరలి వచ్చినా అధిక కౌంటర్లు ఏర్పాటు చేయడంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా వాహనాలు ముందుకు కదిలాయి. దీంతో వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు. ఎండల పెరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల విధులకు వెళ్లే సిబ్బందికి మజ్జిగ పంపిణీ చేశారు. అన్ని మండలాల్లో 40డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు.

తాత్కాలిక ఉపశమనమే

భువనగిరి టౌన్: ఇటీవల రెండు రోజుల పాటు కురిసిన వర్షాలతో వాతావరణంలో తేమశాతం పెరిగి ఉక్కపోత కాస్త తగ్గింది. వేసవి తీవ్రత తగ్గుముఖం తాత్కాలికమే అయినప్పటికీ కొద్ది రోజుల పాటైనా సూర్యప్రతాపం నుంచి తప్పించుకోగలిగామని పలువురు అంటున్నారు. వాతావరణ శాఖ జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా ఎప్పటికప్పుడు ఉష్ణోగ్రత, వర్షపాతం హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రంలోని సర్వర్‌లో నమోదవుతుంటాయి. పది రోజుల్లో 1వ తేదీననే గరిష్టంగా 45.6 డిగ్రీలు అదే రోజు కనిష్టంగా 41.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. 7వ తేదీ మినహా 8వ తేదీ వరకు గరిష్టంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా 9వ తేదీన 38.9 డిగ్రీలుగా నమోదైంది. తిరిగి శుక్రవారం గురువారంతో పోలిస్తే గరిష్టంగా, కనిష్టంగా ఒక డిగ్రీ పెరిగింది. కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా అదే రీతిన నమోదయ్యాయి. ఆదివారం ఉష్ణోగ్రతల్లో మళ్లీ మార్పులు వస్తున్నాయి. ఎండలు క్రమంగా పెరగుతున్నాయి. అకాల వర్షాలతో పండ్ల తోటలకు నష్టం జరిగింది.

మూసీ ప్రాజెక్టుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో


మూసీ రిజర్వాయర్

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు నిరంతరాయంగా ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. 645అడుగులు (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు ఈ నెల మొదటి వారంలో సాగునీటి విడుదలను నిలిపి వేసే నాటికి ప్రాజెక్టు నీటిమట్టం 618అడుగులు (0.38టీఎంసీలు) కనిష్ట స్థాయికి పడిపోయింది. ఈ క్రమంలో మూసీ నది ఎగువన గల ధర్మారెడ్డి కాల్వ, పిల్లాయిపల్లి, ఆసిఫ్‌నహర్ కత్వలు, ఇతర ఫీడర్ ఛానళ్లకు హైదరాబాద్ నగరం నుంచి వచ్చే డ్రైనేజీ, వృధా నీటిని మళ్ళించడంతో చిట్యాల, రామన్నపేట, నార్కట్‌పల్లి, శాలిగౌరారం మండలంలోన్ని పలు చెరువులు, కుంటలు నిండి ప్రస్తుతం అలుగులు పోస్తున్నాయి. ఆయా చెరువులు, కుంటల అలుగుల నుంచి వచ్చే నీరంతా ప్రస్తుతం దిగువన గల మూసీ ప్రాజెక్టుకు చేరుతుండడంతో గత పదిహేను రోజులుగా ప్రాజెక్టుకు దాదాపు 800క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. దీంతో వారం రోజుల క్రితం 624అడుగులకు(0.79టీఎంసీలు) చేరిన ప్రాజెక్టు నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి మరో 4అడుగుల మేర పెరిగి 628.10అడుగులు(1.13టీఎంసీలు)గా నమోదైంది. ఎగువ నుంచి 708క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 70 క్యూసెక్కుల మేర నీరు లీకేజీలు, ఆవిరి రూపంలో వెళుతుంది. కాగా గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టు నీటిమట్టం 640అడుగులు(3.22టీఎంసీలు)గా, ఇన్‌ఫ్లో 732 క్యూసెక్కులుగా ఉంది.

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మామ మృతి

తలకొరివి పెట్టిన బీర్ల సతీమణి అనిత


చందుపట్లలో తండ్రికి తలకొరివి పెడుతున్న బీర్ల అయిలయ్య సతీమణి అనిత

భువనగిరి రూరల్, మే 12: ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మామ సుబ్బూరు సత్తయ్య (80) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతిచెందగా, ఎమ్మెల్యే భార్య తలకొరివి పెట్టారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం చందుపట్ల గ్రామానికి చెందిన సత్తయ్యకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తండ్రి అనారోగ్యంతో మృతిచెందగా, ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. చిన్న కుమార్తె బీర్ల అనిత తలకొరివి పెట్టారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, భువనగిరి, తుంగతుర్తి ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేల్, ఎంపీ అభ్యర్థులు క్యామ మల్లేష్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గ్రామానికి చేరుకొని సత్తయ్య భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. బీర్ల అయిలయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, జడ్పీటీసీ సుబ్బూరు బీరు మల్లయ్య, ఎంపీపీ నరాల నిర్మల, నాయకులు ఎడ్ల సత్తిరెడ్డి, పచ్చిమట్ల శివరాజ్‌గౌడ్, ఎమ్ఎల్ఎన్ రెడ్డి, పోత్నక్ ప్రమోద్‌కుమార్, తంగళ్ళపల్లి రవికుమార్, వల్లందాసు ఆదినారాయణ, చిన్నం శ్రీనివాస్, ఎంపీటీసీ బొక్క కొండల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చిన్నం పాండు తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

అభివృద్ధిని కాంక్షించే వారికే మా ఓటు

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం. అయిదేళ్ల పాలనలో ప్రజలకు నిస్వార్థంగా చేయగలిగే వ్యక్తిని ఎంచుకునే ఓటు విలువ వెల కట్టలేనిది. ప్రజలకోసం ప్రజలే పాలకులను ఎన్నుకునేందుకు ఈ వ్యవస్థలో ఓటరు కీలక భూమిక పోషించనున్నాడు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటే ప్రజాస్వామ్య వ్యవస్థ పదికాలాలపాటు మనగలుగుతుందని యువత అంటున్నారు.హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 2,47,715 ఓటర్లుండగా, అందులో 1,20,698 మంది పురుషులు,1,26,980 మహిళ ఓటర్లు ఉండగా అందులో కొత్తగా సుమారు 5,147 మంది మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నిక ల్లో తొలిసారి ఓటు వేయనున్నారు. ప్రజాసంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి, అందరికి అందుబాటులో ఉంటే నిస్వార్థపరులైన నాయకులకు ఓటు వేస్తామని యువత చెబుతున్నారు.

- మఠంపల్లి

నిస్వార్థంగా పని చేసేవారికి నా ఓటు



పార్టీలకు సంబంధం లేకుండా నిస్వార్థంగా పనిచేయగలడనే నమ్మకం ఉన్నవారికే ఓటర్లు పట్టం కట్టాలి. ధనిక పేద అంటూ తేడా ఉండదు. అందరికీ ఓటు సమానమే. ఓటు హక్కు ఎంతో విలువైంది. దాన్ని దుర్వినియోగపర్చను. అన్నింటిలో ఓటుహక్కు సమానత్వం కల్గిస్తుంది. నిస్వార్థంగా పని చేసే వారికే ఓటు వేస్తా.

- దగ్గుపాటి మహేష్ మఠంపల్లి

ప్రజా సమస్యలపై స్పందించే వారికే



ప్రజా సమస్యలపై వెంటనే స్పందించే వారికి ఓటు వేస్తా. ఎలాంటి ప్రలోభాలకు లొంగేవారికి కాకుండా పార్టీలకతీతంగా పనిచేసే వారికే మద్దతు తెలిపి ఓటు పవిత్రను కాపాడుతా. మా స్నేహితులు సైతం ఇలాంటి వారికి ఓటు వేస్తామని చెప్పారు.

- సోమిరెడ్డి నరసింహారెడ్డి చౌటపల్లి

ప్రజల కోసం పనిచేసే వారికే



మానవ హక్కులను కాపాడే అభ్యర్థులను ఓటర్లు గుర్తించాలి. ఉచిత హామీలు, ప్రలోభాలకు గురిచేసే వారిపట్ల ఓ టర్లు అప్రమత్తంగా ఉండాలి. స్వచ్ఛ గుణాలు కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వాలి. నిరంతరం ప్రజల సంక్షేమం కోసం పనిచేసే వారికే నా ఓటు. ఎలాంటి ప్రలోభాలకు తలవంచక నిస్వార్థంగా సేవ చేసే వారికే ఓటు వేస్తా.

- గుర్రం సందీప్‌నేత,మఠంపల్లి

భవిష్యత్‌ను ఆకాంక్షించి



ప్రజాస్వామ్యంలో ఓటు అనే ఆయుధాన్ని వాడుకొని ప్రజాసేవకు అంకితమయ్యే అభ్యర్థులను ఓటర్లు ఎన్నుకోవాలి. ఎన్నికల సమయంలో కాకుండా భవిష్యత్‌లో సైతం మనకు అండగా నిలుస్తారనే నమ్మకం కలిగిన అభ్యర్థికి ఓటేస్తా. ప్రజల బాగోగులను తెలుసుకొని నిస్వార్థంగా పనిచేసే వారికి ప్రజలు గుర్తించి పట్టం కట్టాలి.

- మహమ్మద్ జావీద్‌బాబా

అందుబాటులో ఉండే వారికి ప్రాధాన్యం



నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తున్న వారికే ప్రాధాన్యమిస్తా. ఎన్నికల ముందు ఏదో చెప్పి తర్వాత కన్పించకుండా పోయేవారికి అవకాశం ఇవ్వను. ఓడినా, గెలిచినా నియోజకవర్గంలోనే ఉంటూ అందరికి అండగా ఉంటాడనే నమ్మకం ఉన్న వ్యక్తికే ఓటు వేస్తా.

- బానోతు కోటేష్‌నాయక్ పాతతండా

ఓటేద్దాం

ప్రజాస్వామ్యాన్ని గెలిపిద్దాం

- శతశాతం పోలింగ్ లక్ష్యానికి ఆటంకమవుతున్న నిర్లక్ష్యం
- స్థానిక సంస్థల, అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే తగ్గుతున్న ఓటింగ్
- దేశ భవిష్యత్‌ను నిర్ణయించేవే పార్లమెంట్ ఎన్నికలు
- ఓటు వేయడం అందరి బాధ్యత



భువనగిరి టౌన్, మే 12: ప్రతీ ఎన్నికల్లోనూ పోలింగ్‌శాతాన్ని పెంచేందుకు అధికారులు శతవిధాల ప్రయత్నిస్తున్నారు. అయితే స్థానిక సంస్థల్లో లక్ష్యానికి చేరువగా పోలింగ్ జరుగుతుండగా అసెంబ్లీ ఎన్నికల్లో కూడా మెరుగైన పోలింగ్ జరుగుతోంది. కానీ పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం ఆ రెండు ఎన్నికలతో పోలిస్తే పోలింగ్ శాతం తగ్గుతుండటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి ఆటంకంగా మారుతోంది. పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే పార్టీల నాయకులు, అభ్యర్థులు స్థానిక సంస్థలు, అసెంబ్లీ ఎన్నికల్లో ప్రలోభాలకు గురిచేస్తుండడంతోపాటు ప్రతీ ఓటరుపై వ్యక్తిగత శ్రద్ధ చూపుతుండటంతో ఆ రెండింటిలో గణనీయ పోలింగ్ నమోదవుతోంది. కానీ పార్లమెంట్ ఎన్నికల్లో అందుకు భిన్నమైన పరిస్థితులుంటుండడంతో పోలింగ్ శాతం తగ్గుతున్నట్లు విశ్లేషకుల అంచనా. ప్రతీఓటరు విధిగా పోలింగ్‌లో పాల్గొంటేనే ప్రజాస్వామ్యం నిలకడగా ఉండటంతోపాటు నచ్చిన అభ్యర్థి, పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశం ఉంటుందని అధికారులతోపాటు సామాజిక కార్యకర్తలు స్పష్టం చేస్తున్నారు.

పోలింగ్ శాతం ఇలా..

2019 పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో గరిష్ఠంగా భువనగిరి అసెంబ్లీ సెగ్మెంట్‌లో 81.79శాతం, కనిష్ఠంగా ఇబ్రహీంపట్నంలో 66.90శాతం, నల్లగొండ పార్లమెంట్‌లో గరిష్ఠంగా కోదాడలో 78.01శాతం, కనిష్ఠంగా దేవరకొండలో 68.77శాతం పోలింగ్ నమోదైంది. అలాగే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్‌లో గరిష్ఠంగా మునుగోడులో 91.89 శాతం, కనిష్ఠంగా ఇబ్రహీంపట్నం 74.93శాతం, నల్లగొండ పార్లమెంట్‌లో గరిష్ఠంగా హుజూర్‌నగర్‌లో 86.43 శాతం, కనిష్ఠంగా నల్లగొండలో 81.60శాతం పోలింగ్ నమోదైంది. అయితే 13 మే 2024న జరిగే 18వ పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల్లో రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లోని 14అసెంబ్లీ సెగ్మెంట్లలో శతశాతం పోలింగ్ లక్ష్యంగా అధికార యంత్రాంగం చేస్తున్న కృషికి అభ్యర్థులు, పార్టీల నాయకులు కూడా సహకరించాలని ప్రజాస్వామ్య కార్యకర్తలు సూచిస్తున్నారు. అలాగే ఓటేయాల్సిన బాధ్యతను కూడా అందరూ గుర్తెరగాలని, ఓటు వేయని వారు పాలకులను, అధికారులను ప్రశ్నించే హక్కు కోల్పోతారని కూడా స్పష్టం చేస్తున్నారు.

ఆ ఒక్క రోజు పనులను వాయిదా వేసుకోవడం బాధ్యత

పోలింగ్ రోజున ఉండే పనులను వాయిదా వేసుకొని ఓటింగ్‌లో పాల్గొనేలా ముందస్తుగా ప్రణాళికలు చేసుకోవాల్సి ఉంటుంది. అత్యవసరమైతే ఓటు వేశాకే వెళ్లడం లేదా పోలింగ్ ముగిసేలోపు వచ్చి ఓటేసేలా ప్రణాళిక రూపొందించుకుంటే మరింత మంచిది. స్థానిక సంస్థల ఎన్నికలు, గ్రామాలు, పట్టణాల భవిష్యత్‌ను, అసెంబ్లీ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్‌ను తీర్చిదిద్దుతుండగా సుమారు 147 కోట్ల మంది నివసిస్తున్న దేశ భవిష్యత్ పార్లమెంట్ ఎన్నికలపైనే ఆధారపడి ఉంటుందని అందరూ గ్రహించాలి. రాజకీయ నాయకులు, అభ్యర్థులు కూడా తమ ఎన్నికల ప్రచారంతోపాటు పోలింగ్ శాతాన్ని పెంచేందుకు, ప్రతిఒక్కరూ ఓటు వేసేలా చైతన్యపరిచే కార్యక్రమాలను కూడా చేపడితే బాగుంటుందని పలువురు అంటున్నారు. 45శాతం పైగా వైకల్యం ఉన్న దివ్యాంగులు, 85 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఇంటి వద్దే ఓటు వేసే సదుపాయం, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది అందరికీ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ముందుగానే ఓటేసే అవకాశం ఎన్నికల సంఘం కల్పిస్తోంది. ఎక్కడ నివాసం ఉంటున్నా ఓటు హక్కు ఉన్న ప్రదేశంలో ఓటు వేసేందుకు ఆన్‌లైన్‌లోనే ఓటర్ స్లిప్, ఓటర్ ఐడీ కార్డు, డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం, పోలింగ్ బూత్‌ను తెలుసుకునే మ్యాపింగ్ అందుబాటులో ఉన్నాయి. అయినప్పటికీ పలు కారణాలు చూపుతూ పలువురు ఓటింగ్‌కు దూరంగా ఉంటుండడం సరికాదని పలువురు అంటున్నారు. స్వీప్ కార్యక్రమంలో పేరిట పోలింగ్‌శాతాన్ని పెంచేందుకు ఎన్నికల కమిషన్ శత విధాల ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో అర్హులందరూ ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో పాల్గొనాలని అధికారులు సూచిస్తున్నారు. ఒక్క ఓటుతో అటల్ బిహారీ వాజ్‌పేయి అధికారాన్ని కోల్పోయిన ఘటన, ముగ్గురు అమెరికా అధ్యక్షులు ఒక్కో ఓటుతో ఓడిపోయిన చారిత్రక నిజాలను ఓటర్లు గుర్తెరిగి తమకు నచ్చిన అభ్యర్థులు, పార్టీల గెలుపుకోసం విధిగా ఓటు వేయడం మరువొద్దు.

అర్హులందరూ ఓటు వేయాలి



ఓటు హక్కు కలిగిన వారంతా మే 13న విధిగా ఓటు వేయాలి. ఓటు వేయడం బాధ్యతగా గుర్తెరగాలి. పోలింగ్ సజావుగా సాగేందుకు పోలింగ్ బూత్‌లలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. వేసవి తీవ్రత దృష్ట్యా ఎన్నికల కమిషన్ కూడా పోలింగ్ సమయాన్ని సాయంత్రం 6 వరకు పొడగించింది. ఎంతటి అత్యవసరమైన పనులున్నా ఓటు వేయడం మరువొద్దు, పోలింగ్‌శాతాన్ని పెంచేందుకు ఓటర్లను చైతన్య పరుస్తాం.

- హనుమంతు కే.జెండగే, కలెక్టర్, యాదాద్రి భువనగిరి.



నియోజకవర్గం (భువనగిరి పార్లమెంట్)	2019 పార్లమెంట్ పోలింగ్	2023 అసెంబ్లీ పోలింగ్	2024పార్లమెంట్ ఎన్నికల ఓటర్లు
మునుగోడు	78.02 శాతం	91.89 శాతం	2,52,648
నకిరేకల్	75.92 శాతం	86.67 శాతం	2,50,457
తుంగతుర్తి	72.18 శాతం	87.63 శాతం	2,55,017
భువనగిరి	81.79 శాతం	89.91 శాతం	2,16,941
ఆలేరు	80.36 శాతం	90.77 శాతం	2,33,266
జనగామ	68.22 శాతం	85.70 శాతం	2,37,108
ఇబ్రహీంపట్నం	66.90 శాతం	74.93 శాతం	3,27,583
(నల్లగొండ పార్లమెంట్)			
దేవరకొండ	68.77 శాతం	84.43 శాతం	2,61,858
నాగార్జునసాగర్	72.30 శాతం	85.79 శాతం	2,35,796
మిర్యాలగూడ	73.80 శాతం	83.89 శాతం	2,35,334
నల్లగొండ	74.89 శాతం	81.60 శాతం	2,47,722
హుజూర్‌నగర్	77.02 శాతం	86.43 శాతం	2,50,099
కోదాడ	78.01 శాతం	85.56 శాతం	2,45,201
సూర్యాపేట	73.65 శాతం	84.21 శాతం	2,42,945

వజ్రాయుధమే

భువనగిరి అర్బన్: రాజకీయ పార్టీల భవితవ్యం.. అభ్యర్థుల అదృష్టం.. నేడు జరిగే పోలింగ్‌తో తేలనుంది. అభ్యర్థులు ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి హోరెత్తించిన ప్రచారం తర్వాత ఓటర్లు ఇచ్చే తీర్పు నేడు ఈవీఎంలో నిక్షిప్తం కానుంది. ఓటు హక్కుగల ప్రతీ పౌరుడు ఓటు వినియోగించుకునేందుకు సిద్ధంకావాలని స్వీప్ ద్వారా జిల్లా యంత్రాంగం ఇదివరకే విస్తృత ప్రచారం చేపట్టింది. తాము వేసే వజ్రాయుధం వంటి ఓటు ద్వారా ప్రజాస్వామ్యం పరిరక్షణ వాస్తవాన్ని ప్రతీ ఓటరు గమనంలోకి తీసుకొని సామాజిక బాధ్యతగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలి.

ప్రజాస్వామ్యాన్ని బతికించడమే..

వజ్రాయుధం వంటి ఓటును ప్రతి ఓటరు సద్వినియోగం చేసుకోవడమే కాక తాము వేసే ఓటుతో నేతల భవిష్యత్‌ను మార్చేస్తుంది. రెండు అక్షరాల ఓటు ద్వారా దేశంలో ప్రజాస్వామ్యాన్ని బతికించడమే కాక అవినీతిరహిత నేతను ఎంపీగా ఎన్నుకునే అవకాశం ఉంటుంది. సమాజానికి ఉత్తమ నాయకుడిని ఎన్నుకునేందుకు బృహత్తర అవకాశంతో నిర్భయంగా, నిష్పక్షపాతంగా ఓటు వేయాలి. ఈ ఓటు ద్వారానే ఐదేళ్లకొకసారి ఓటర్లు రాజకీయ పార్టీలకు దేవుళ్ల వలే దర్శనమిస్తారు. ఓటర్ల ప్రసన్నం కోసమే నానా తంటాలు పడుతుండగా ఓటర్లు మాత్రం ఎలాంటి ప్రలోభాలకు, ఆర్భాటాల వైపు మొగ్గు చూపపితే.. అనర్హుడిని రాజ్యాంగ పీఠం ఎక్కించిన వారవుతారన్న సత్యాన్ని గ్రహించాలి. అందుకే వజ్రాయుధం వంటి ఓటు కలిగిన ప్రతీ ఓటరు తమ ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని అధికారులు స్వీప్ ద్వారా వినిపించారు.

ఉదయం పూట మేలు

ఓటు వేసేందుకు ఉదయం పూట మేలు. ఎండ ముదరక ముందే పోలింగ్ కేంద్రాలకు చేరుకొని తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని అధికారులు ప్రచారం చేయగా, ఓటు వేయడం ఉదయం ఏడు గంటలకే మొదలవుతుంది. పగటివేళ ఎండలు అధికంగా ఉండటంతో ఓటర్లు ఉదయమే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలి. మాడు పగిలేంత ఎండల్లో అత్యవసరమైతే బయటకు వెళ్లలేని ఇప్పటి పరిస్థితుల్లో ఉదయం పూటే మంచిదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అదనంగా పోలింగ్ కేంద్రాలు

ఓటు వేసేందుకు భారీ లైన్లు ఉంటాయనే భయం అక్కడ లేకుండా ఎన్నికల సంఘం అదనంగా పోలింగ్ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. ఎండల దృష్ట్యా ఎన్నికల సంఘం గంట సమయం పొడిగించింది. ప్రతి పోలింగ్ కేంద్రంలో సగటున 1,400 మంది ఓటర్లు మాత్రమే ఓటు వేసే వీలుండేట్లు అవకాశం కల్పించారు.

వసతుల ఏర్పాటు

ఎండల తీవ్రత అధికంగా ఉండగా ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద నీడ కోసం టెంట్లతోపాటు చల్లటి తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఉక్కపోత నుంచి ఉపశమనం కలిగేందుకు కూలర్లు, ఫ్యాన్లు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగులను ఇంటి తరలించేందుకు ఉచిత రవాణ సౌకర్యంతోపాటు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రతీ ఓటరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేలా అన్ని రకాల ఏర్పాట్లు చేశారు.



భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పురుషులు	స్త్రీలు	ఇతరులు
1 ఇబ్రహీంపట్నం	339341	180807	168499	35
2.మనుగోడు	257557	128233	129321	3
3.భువనగిరి	220596	108801	111794	1
4.నకిరేకల్	253785	125451	128330	4
5.తుంగతుర్తి	259265	128719	130539	7
6.ఆలేరు	235270	116914	118337	19
7.జనగామ	242771	119491	123270	10
మొత్తం	1808585	898416	910090	79

నల్లగొండ లోక్‌సభ పరిధిలోని ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	థర్డ్ జెండర్	మొత్తం
1. దేవరకొండ	1,31,838	1,30,624	18	2,62,480
2.నాగార్జునసాగర్	1,15,852	1,20,611	21	2,36,484
3. మిర్యాలగూడ	1,15,773	1,20,544	26	2,36,343
4. హుజూర్‌నగర్	1,21,956	1,29,471	17	2,51,444
5. కోదాడ	1,19,172	1,25,997	18	2,45,187
6. సూర్యాపేట	1,18,949	1,25,154	13	2,44,116
7. నల్లగొండ	1,21,303	1,28,052	56	2,49,411
మొత్తం	8,44,843	8,80,453	169	17,25,465

దారులన్నీ ఏపీ వైపు

- ఓటు వేసేందుకు పట్నం వదిలి పల్లెకు పయనం
- పంతంగి, కొర్లపహాడ్ టోల్‌గేట్ల వద్ద వాహనాల రద్దీ



చౌటుప్పల్‌లోని జాతీయ రహదారిపై ఏపీ వైపునకు వెళ్తున్న వాహనాల రద్దీ

చౌటుప్పల్ టౌన్, కేతేపల్లి, మే 12: ఏపీ రాష్ట్రంలోని స్వగ్రామాలకు వెళ్లే ఓటర్ల వాహనాలతో యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని 65వ నంబరు జాతీయ రహదారి ఆదివారం రద్దీగా మారింది. మూడో రోజు ఆదివారం కూడా హైదరాబాద్‌లోని సెటిలర్లు సొంతూళ్లలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు వాహనాల్లో ఏపీ రాష్ట్రం వైపు తరలివెళ్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద 16కౌంటర్లు ఉండగా, విజయవాడ వైపు 10కౌంటర్ల ద్వారా వాహనాలను అనుమతిస్తున్నారు. సాధారణ రోజుల్లో 30వేల నుంచి 35వేల వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుండగా, ఆదివారం సాయంత్రం అదనంగా 15వేల వాహనాలు కొనసాగించాయి. సోమవారం ఉదయం వరకు వాహనాల రద్దీ కొనసాగుతుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. ఏపీలోని సొంతూళ్లకు వెళ్లి వచ్చేందుకు వివిధ పార్టీల నాయకులు వాహనాలు సమకూర్చినట్లు సమాచారం. హైదరాబాద్‌లో నివసిస్తున్న ఏపీలోని విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, గుంటూరు, రాజమండ్రి, తిరుపతి, కాకినాడ ప్రాంతాలకు చెందిన వారు ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు, సొంత వాహనాల్లో స్వగ్రామాలకు తరలి వెళుతున్నారు. వీరితో పాటు తెలంగాణలోని ఖమ్మం, భద్రాచలం ప్రాంతాల వారు సైతం ఓటు వేసేందుకు స్వస్థలాలకు బయలుదేరారు. గత శుక్రవారం నుంచి సాయంత్రం హైవేపై వాహనాల రద్దీ కొనసాగుతోంది. ఎక్కువ సంఖ్యలో వస్తున్న వాహనాలతో నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ గ్రామ శివారులో గల టోల్‌ప్లాజా వద్ద రద్దీ ఏర్పడకుండా టోల్‌ప్లాజా నిర్వాహకులు విజయవాడ వైపు వెళ్లే వాహనదారులు టోల్ చెల్లింపులకు అదనపు కౌంటర్లను ఏర్పాటు చేశారు. టోల్‌ప్లాజాలోని 12కౌంటర్లలో ఏడు కౌంటర్లను విజయవాడ వైపు వెళ్లే వాహనాలకు కేటాయించారు. దీంతో టోల్‌ప్లాజాలో ఆలస్యం జరగకుండా వాహనాలు ముందుకు సాగుతున్నాయి.



కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ

ఆకర్షణీయంగా.. ఆకట్టుకునేలా



సూర్యాపేటలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్



భువనగిరిలో..

లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్‌ను పెంచే లక్ష్యంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మోడల్ పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. బెలూన్స్, పూలతో అలంకరించి ఓటర్లకు రెడ్, గ్రీన్ కార్పెట్ల ద్వారా స్వాగతం లభించేలా తీర్చిదిద్దారు. వెబ్ కాస్టింగ్ కూడా నిర్వహించనున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఓటింగ్ జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. సాధారణ పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ఓటర్లకు మోడల్ పోలింగ్ బూత్‌లలో సిబ్బంది స్వాగతం పలకడంతో పాటు తాగునీరు, కూర్చునేందుకు కుర్చీలు, ఫ్యాన్లు సదుపాయాలు కూడా కల్పించారు.



నల్లగొండలోని బొట్టుగూడలో ఏర్పాటు చేసిన ఆదర్శ పోలింగ్ కేంద్రం



సూర్యాపేట జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన యువ ఆదర్శ పోలింగ్ కేంద్రం



సూర్యాపేట జిల్లా తిరుమలగిరి పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం



సంస్థాన్‌నారాయణపురంలోని ఆదర్శ పోలింగ్ స్టేషన్



సూర్యాపేట జిల్లాకేంద్రంలో మహిళల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలింగ్ కేంద్రం



నల్లగొండ జిల్లా త్రిపురారం మహిళా పోలింగ్ స్టేషన్‌వద్ద సిబ్బంది

పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సన్నద్ధం

నేడు జరగబోయే పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు, ఎన్నికల సామగ్రితో అధికారులు, సిబ్బంది చేరుకున్నారు. తుంగతుర్తిలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్లు లత, ప్రియాంక పరిశీలించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికలు సజావుగా జరగడానికి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యే నిఘా పెట్టారు. పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144సెక్షన్ విధించారు. హుజూర్‌నగర్‌లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో పోలింగ్ కేంద్రంలోని వర్షం నీరు చేరి కొంత ఇబ్బంది కలిగించింది. ఎండవేడిమికి తుంగతుర్తిలో ఒక సిబ్బంది స్పృహ కోల్పోయారు.

● ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్



హుజూర్‌నగర్‌లోని ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది

కోదాడ నియోజకవర్గ పరిధిలో 296 పోలింగ్ కేంద్రాలు

● ఓటు హక్కు వినియోగించుకోనున్న 2,45,187మంది ఓటర్లు



కోదాడలో పోలింగ్ విధులకు తరలివెళుతున్న ఎన్నికల అధికారులు

కోదాడ: నేడు జరిగే పార్లమెంటు ఎన్నికలకు అధికారులు అన్ని పూర్తి చేశారు. కోదాడ నియోజకవర్గ పరిధిలో కోదాడ, మోతె, మునగాల, చిలుకూరు, అనంతగిరి, నడిగూడెం మండలాలు ఉన్నాయి. ఈ ఆరు మండలాల్లో 2,45,187మంది ఓటర్లు ఉన్నారు. సోమవారం జరిగే ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. కాగా, పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మోతె మండలంలో 48పోలింగ్ కేంద్రాలు, మునగాలలో 44, చిలుకూరులో 38, అనంతగిరిలో 33, కోదాడ పట్టణంలో 65, కోదాడ రూరల్‌లో 39, నడిగూడెం మండలంలో 29కేంద్రాలను ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూర్యనారాయణ తెలిపారు. అదే విధంగా ఎన్నికల నిర్వహణకు 25రూట్లను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నిర్వహణలో 296మంది పీవోలు, 296మంది ఏపీవోలు, 592మంది పాల్గొంటున్నట్లు తెలిపారు. ఓటర్లకు ఇబ్బంది లేకుండా, ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సోమవారం మధ్యాహ్నంలోపే ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

చిలుకూరు: పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు మండల వ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో 38 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. మండలంలో మొత్తం 32,350మంది ఓటర్లు ఉన్నారు. మండల కేంద్రంలోని చిలుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో మహిళా పోలింగ్ కేంద్రాన్ని ప్రత్యేకంగా, ఆకర్షణీయంగా తయారు చేశారు. మండల వ్యాప్తంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తహసీల్దార్ ధ్రువకుమార్, ఎంపీడీవో గిరిబాబు, ఎస్ఐ సురభి రాంబాబు తెలిపారు.



చిలుకూరులో ఏర్పాటు చేసిన మహిళా నిర్వహణ పోలింగ్ కేంద్రం

పెన్‌పహాడ్ మండలంలో 40పోలింగ్ కేంద్రాలు



పెన్‌పహాడ్‌లోని పోలింగ్ స్టేషన్‌కు చేరుకున్న ఎన్నికల అధికారులు

పెన్‌పహాడ్: పార్లమెంట్ ఎన్నికలకు పెన్‌పహాడ్ మండలంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో 134నుంచి 173వరకు 40పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పురుష ఓటర్లు 16351, మహిళా ఓటర్లు 17122మంది, మొత్తం 33,473మంది ఓటర్లు ఉన్నారు. ఈవీఎంలతో పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది ఆదివారం సాయంత్రానికి చేరుకున్నారు. మండలంలో ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్ఐలు, 13 మంది స్పెషల్ మిలటరీ సిబ్బంది, 58మంది పోలీస్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ పెరక రవీందర్ తెలిపారు.

ప్రతి పోలింగ్ కేంద్రానికి అదనంగా రెండు ఈవీఎంలు



హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు

హుజూర్‌నగర్: పార్లమెంట్ ఎన్నికలకు హుజూర్‌నగర్ నియోజకవర్గంలో అధికారులు సర్వసన్నద్ధం చేశారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈవీఎంలను, ఎన్నికల సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది తరలించారు. నియోజకవర్గంలో 308పోలింగ్ కేంద్రాలు ఉండగా 29రూట్లుగా విభజించారు. నియోజకవర్గంలోని 308 పోలింగ్ కేంద్రాలకు పీవో, ఏపీవో, ఓపీవోలతో పాటు 1232మంది సిబ్బందిని నియమించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటుచేశారు. ఈవీఎంలు మొరాయిస్తే ప్రతి పోలింగ్ కేంద్రానికి రెండు ఈవీఎంలను అదనంగా ఏర్పాటుచేశారు. ఈవీఎంలకు సంబంధించి నియోజకవర్గంలో 10మంది ట్రబుల్ షూటర్స్ ముగ్గురు ఇంజనీర్లను నియమించారు. 39సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి పెట్టారు. 678పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో మొత్తం 1910 మంది అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో 308 పోలింగ్ కేంద్రాల్లో 2,51,444 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 1,21,956, మహిళలు 1,29,471మంది, ఇతరులు 17మంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల అధికారులు

హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలకు ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల అధికారులు వివిధ ప్రాంతాలకు ఈవీఎంలతో తరలివెళ్లారు. ఉదయం నుంచి మధ్యాహ్నం మూడున్నర గంటల వరకు పోలింగ్ కేంద్రాలకు కొంతమంది తరలివెళ్లగా, సాయంత్రం భారీ వర్షం కురవడంతో విధులకు వెళ్లాల్సిన అధికారులు, సిబ్బంది ఇబ్బంది పడ్డారు.

పాలకవీడు: నేడు జరిగే పార్లమెంట్ ఎన్నికలకు మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దార్ శ్రీదేవి తెలి పారు. సిబ్బంది, అధికారులు ఈవీఎంలతో ఆదివారం సాయంత్రం పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. ఎస్ఐ లక్ష్మీనర్సయ్య మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా పెంచామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మఠంపల్లి: మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అధికారులకు ఓటర్లు, ప్రజలు సహకరించాలని మఠంపల్లి ఎస్ఐ రామాంజనేయులు కోరారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలను ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పోలింగ్ కేంద్రాలకు జియో ట్యాగింగ్ ఏర్పాటు చేసి సీసీ కెమెరాలను అనుసంధానం చేశామన్నారు. కేంద్రాలతో పాటు ఓటర్ల జాబితాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. అందరి సహకారంతో ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. గొడవలు, అల్లర్లు జరిగే ప్రాంతాలలకు త్వరగా చేరుకోవడానికి, వాటికి చెక్ పెట్టేందుకు జియోట్యాగింగ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృషి సారించి నిఘా ఏర్పాటు చేశామన్నారు. మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 46పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు చేరుకున్నారన్నారు.

మేళ్లచెర్వు: సార్వత్రిక ఎన్నికలకు ఉమ్మడి మండల వ్యాప్తంగా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం సాయంత్రానికి పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నారు. మేళ్లచెర్వు మండల వ్యాప్తంగా 42బూత్‌లకు 20పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. మండలంలోని వెంకట్రామపురం గ్రామంలోని పోలింగ్ బూత్‌ను మోడల్ బూత్‌గా ఏర్పాటుచేశామని, మండలంలో168 మంది సిబ్బంది పాల్గొంటున్నారని, మండలంలో 16,457మంది పురుష ఓటర్లు, 17,330 మంది మహిళా ఓటర్లు, ఒక థర్డ్ జండర్‌తో మొత్తం 33,878మంది ఓటర్లు ఉన్నారని తహసీల్దార్ జ్యోతి తెలిపారు.

● చింతలపాలెం మండలంలో 36బూత్‌లకు 26పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశామని తహసీల్దార్ సురేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలో తొమ్మి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, మండలంలోని దొండపాడు గ్రామంలో మహిళా పోలింగ్ బూత్ కేంద్రాన్ని ఏర్పాటుచేశామని, మండల వ్యాప్తంగా పోలింగ్ విధుల్లో 144మంది సిబ్బంది పాల్గొంటున్నారని, మండల వ్యాప్తంగా 12,992 మంది పురుష, 13,538 మంది మహిళా ఓటర్లు, మొత్తం 26,530 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారని తహసీల్దార్ తెలిపారు.



మఠంపల్లికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది

ఎన్నికలు సమర్థంగా నిర్వహించాలి: అదనపు కలెక్టర్లు ప్రియాంక. లత



తుంగతుర్తిలో పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్లు ప్రియాంక, లత

తుంగతుర్తి: పార్లమెంట్ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్లు ప్రియాంక, లత అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గోదాంలో ఎన్నికల సామాగ్రిని పంపిణీ చేసి మాట్లాడారు. తుంగతుర్తి నియోజకవర్గంలోని 326పోలింగ్ కేంద్రాల్లో 2,59,265 మంది ఓటర్లు ఉన్నారని, వారి కోసం 1535మంది పోలింగ్ సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల్లో ఎలాంటి అజాగ్రత్త వహించొద్దని,, ఎలాంటి సమస్య ఉన్న ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని, ఎన్నికల సజావుగా జరిగేలా సహకరించాలని కోరారు.

పటిష్ట బందోబస్తు: డీఎస్పీ

తుంగతుర్తి నియోజకవర్గంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ మట్టయ్య తెలిపారు. ఇద్దరు డీఎస్పీలు, ఐదుగురు సీఐలు, 15మంది ఎస్ఐలు, 200మంది ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు, ఇతర పోలీసులు 500మందిని వినియోగిస్తున్నామని తెలిపారు. ఎన్నికల సజావుగా జరిగేలా ప్రజలు, నాయకులు సహకరించాలని పిలుపునిచ్చారు.

●**తిరుమలగిరి, తిరుమలగిరి రూరల్:** పార్లమెంట్ ఎన్నికలకు తిరుమలగిరిలో ఏర్పాటు పూర్తయ్యాయి. పోలింగ్ సిబ్బంది, అధికారులు ఆదివారం సాయంత్రానికి తిరుమలగిరి మండలం, మునిసిపాలిటీ కేంద్రానికి చేరుకున్నారు. మునిసిపల్ కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు తిరుమలగిరిలో 40 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిని మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి పరిశీలించారు. తిరుమలగిరిలో 32,964మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు16,427 మంది, మహిళలు 16,537మంది ఉన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో 144సెక్షన్

● **మద్దిరాల:** పార్లమెంట్ ఎన్నికల కోసం మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల ప్రత్యేకాధికారి నాగయ్య, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని 31పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రి, ఈవీఎంతో సిబ్బంది చేరుకున్నారన్నారు. మండలంలో 31మంది పీవోలు, 31మంది ఏపీవోలు, 62మంది ఓపీవోలు, 150మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలో 25,078మంది ఓటర్లు ఉన్నారని, సమస్యత్మాక గ్రామాల్లో 144సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.

తుంగతుర్తిలో 2,59,265 మంది ఓటర్లు

మోత్కూరు: భువనగిరి పార్లమెంటు పరిధిలోని తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్ నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. పీవోలు, ఏపీవోలు, పోలింగ్ సిబ్బందికి తుంగతుర్తి రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద ఆదివారం ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. ఈవీఎంలు, ఎన్నికల సామగ్రితో పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన వాహనాల్లో నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. గ్రామాలకు చేరుకున్న సిబ్బంది పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ కోసం తగిన ఏర్పాట్లు చేసుకున్నారు.

●తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో తొమ్మిది మండలాల్లో ఏర్పాటు చేసిన 326 పోలింగ్ కేంద్రాల్లో 2,59,265మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు1,28,719, మహిళలు 1,30,539 మంది, ఇతరులు ఏడుగురు ఉన్నారు.



తుంగతుర్తిలో భార్య పోలింగ్ విధుల్లో ఉండటంతో పాప బాధ్యతను చూస్తున్న తండ్రి, ఎండవేడిమికి స్పృహ కోల్పోయిన సిబ్బంది

తుంగతుర్తి నియోజక వర్గంలో పెరిగిన ఓటర్లు

అసెంబ్లీ ఎన్నికల నాటితో పోల్చితే తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో ఈ ఎన్నికల్లో 4,248 మంది ఓటర్లు పెరిగారు. ఈ అసెంబ్లీ నియోజవర్గంలో పురుషుల కన్నా మహిళా ఓటర్లు 1,820 మంది అధికంగా ఉన్నారు. నియోజకవర్గంలో తొమ్మిది మండలాలు ఉండగా తుంగతుర్తి మండలం మినహా మిగతా ఎనిమిది మండలాల్లో మహిళా ఓటర్లే అధికం.

తుంగతుర్తి నియోజకవర్గంలో మండలాల వారీగా పోలింగ్ కేంద్రాలు, ఓటర్లు

మండలం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
మోత్కూరు	31	13,389	13,685		27,074
అడ్డగూడూరు	30	11,204	11,565	--	22,769
శాలిగౌరారం	52	19,989	20418	3	40,410
అర్వపల్లి	32	11,963	12,208	--	24,171
నూతనకల్	35	14,280	14,302	--	28,582
మద్దిరాల	31	12,458	12,619	1	25,078
తుంగతుర్తి	46	17,016	16,955	--	33,971
నాగారం	29	11,993	12,250	3	24,246
తిరుమలగిరి	40	16,427	16,537	--	32,964
మొత్తం	326	1,28.719	1,30,539	07	2,59,265

హుజూర్‌నగర్‌లో భారీ వర్షం

● పోలింగ్ కేంద్రం ఆవరణలోకి వర్షం నీరు

● ఇబ్బంది పడిన పోలిలంగ్ అధికారులు, సిబ్బంది



ఈదురుగాలుల వర్షానికి కొట్టుకుపోయిన టెంట్లు



విధులకు వెళుతున్న సిబ్బంది

హుజూర్‌నగర్, మే 12: పట్టణంలో ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు ఆకస్మికంగా ఆరగంట పాటు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో స్థానిక గోవిందాపురంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన 221, 228 పోలింగ్ కేంద్రం ఆవరణ మొత్తం వర్షపు నీటితో నిండింది. దీంతో ఎన్నికల విధులు నిర్వహించడానికి వచ్చిన అధికారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నీటితో విధులకు వచ్చిన మహిళ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షపు నీటిని బయటకు పంపేందుకు ఎన్నికల అధికారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. హుజూర్‌నగర్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఉమెన్ పోలింగ్ కేంద్రంలో వేసిన టెంట్లు కూలాయి. అదేవిధంగా పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం మొత్తం తడిసి ముద్దయింది. ఈ కేంద్రంలోని టెంట్లు కూలాయి. అధికారులు ఈవీఎంలు తరలించే సమయంలో వర్షం కురవడంతో సిబ్బంది ఇబ్బంది పడ్డారు. ఒక్కసారిగా ఉరుములు. మెరుపులతో కూడిన వర్షం రావడంతో డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలోని ఖాళీగా ఉన్న గోదాంలోకి సిబ్బంది వెళ్లగా, మార్కెట్ కార్యాలయంలో అధికారులకు ప్రిసైడింగ్ అధికారులు డ్యూటీలు వేశారు. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



హుజూర్‌నగర్‌లో పోలింగ్ కేంద్ర ఆవరణలోకి వచ్చిన వర్షం నీరు

సంప్రదాయబద్ధంగా లక్ష్మీనృసింహుని కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

మఠంపల్లి, మే 12: మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం లక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని పూజారులు తూమాటి రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయచార్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగల్యధారణ, తలంబ్రాలతో నిత్య కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్ కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్,అర్చకులు పాల్గొన్నారు.

మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ

మఠంపల్లి, మే 12: మండలంలోని రఘునాథపాలెం గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు చోరీ చేశారు. స్థానిక రైతులు, విద్యుత్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయ విద్యుత్ అవసరాల కోసం రఘునాథపాలెం గ్రామ శివారులో రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు, స్టాటర్ బాక్సులు, రాగి తీగను శనివారం రాత్రి దొంగలు చోరీ చేశారు. నిందితులను పోలీసులు పట్టుకోవాలని, గ్రామాల్లో రాత్రి వేళల్లో గస్తీ పెంచాలని రైతులు కోరుతున్నారు.